# దొంగ కూడు

'కుక్కకీ, మనిషికీ రాత్రిపూట కూడు ఎక్కువెక్కువ పెట్టరాదు. ఒకటే నిద్ర. రాత్రంతా కాపలా ఉండదు. ఎక్కువయితే కుక్క తినదు. మనిషి ఆవితికాకుండా తింటాడు. కుక్క ఎక్కువై వరండాలోనే కక్కింది. వరండాలో బిరియాని పూటుగా తిన్న వాచ్‌మేన్ వరండా మూలే నిద్రపోయాడు' ఆకలయినప్పుడు తింటుందని కుక్క ప్లేటులో బిరియాని కుక్కి పెట్టారు. యజమానురాలికి కుక్కంటే ఎక్కళ్ళేని ఇష్టం. ఆమె రాత్రి బిరియాని చేసింది. అందరూ ఎక్కువెక్కువ తిన్నారు. మిగిలిందాన్ని పారేయలేక కుక్కకీ వాచ్‌మేన్‌కి ఉన్నదంతా పెట్టేశారు.

రాత్రి ఇంట్లో దొంగపడ్డాడు. కుక్క అరవలేదు. వాచ్‌మేన్ లేవలేదు. దొంగ గోడదూకి వచ్చాడు. గేటుమూసే ఉంది. తాళం వేసే ఉంది. అలికిడివిని యజమాని లేచాడు. కిందకి వస్తూ చేతికర్ర తెచ్చాడు.

దొంగసొత్తు దొంగచేతిలో ఉంది.

యజమాని బలిష్ఠుడు. కసరత్తు చేసిన దేహం. తన ఇంట్లోకి దొంగరావటమా అని కోపం.

దొంగ వెనుకనుంచి, యజమాని, దొంగలాగా నక్కినచ్చి వచ్చి, దొంగ నెత్తి మీద చేతికర్రతో ఒక్క టేశాడు. ఒక్క దొంగకింద పడ్డాడు అరవనుకూడా అరవలేదు. తలపగిలింది. మళ్ళీ లేవలేదు.

అప్పుడు కుక్కలేచి విశ్వాసంతో అరిచింది. వాచ్‌మేన్ డ్యూటీ ప్రకారం విజిల్ ఊదాడు. ఇంట్లో వాళ్ళు లేచారు. లైట్లు వేశారు.

పోలీసు పెట్రోల్‌వేన్ వచ్చింది. వాచ్‌మేన్ గేటు తీశాడు. వాళ్ళు దొంగను చూశారు. అతడిచేతిలో దొంగ సొత్తు భద్రంగా ఉంది. తల, రక్తం మడుగులో ఉంది.

'బతికి ఉన్నాడా? చచ్చాడా?' పోలీసులు అడిగారు.

'ఎవడు చూశాడు?' యజమాని చెప్పాడు.

పోలీసు నాడి చూశాడు 'ఉహూ!' అన్నాడు. ముక్కు దగ్గరవేలు పెట్టాడు. మళ్ళీ 'ఉహూ!' అన్నాడు.

'బతికాడా? చచ్చాడా?' యజమాని అడిగాడు.

'ఏమీ తెలియటంలేదు' పోలీసు చెప్పాడు.

పక్కనున్న ఆడిటోరియంలో నాట్యప్రదర్శన కవర్‌చేసి, టి.వీల వాళ్ళూ, పత్రికలవాళ్ళూ, ఇళ్ళకు పోతూ అలజడి చూసి, వార్త దొరికిందని సంబరపడిపోతూ లోపలికి వచ్చారు.

మూడో ఎస్టేటు వాళ్ళు, నాలుగో ఎస్టేటువాళ్ళని దూరంగా నెడుతున్నారు. వాళ్ళు వెళ్ళరు. వీళ్ళు ఆగరు.

వీళ్ళూ, వాళ్ళూ, మాటలు 'ఏమయింది?

'తెలియదు!' 'శవమా?' 'మనిషే!' 'హత్యా, ఆత్మహత్యా?' 'తెలియదు'.

తలపగిలిన వాణ్ణి అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

రక్తం మడుగు ఫోటోలు!

'కడగొద్దు తుడవొద్దు! తొక్కొద్దు' పోలీసుల హెచ్చరికలు.

మీడియావాళ్ళు ఇంటి యజమానితో ఇంటర్వ్యూ చేస్తున్నారు. ఫోటోలు తీస్తున్నారు. నోటుబుక్కుల్లో రాసుకొంటున్నారు. కెమేరాలు ఏంగిల్స్ తిరుగుతున్నాయి.

అంబులెన్సు వెళుతున్న శబ్దం.

దాన్ని చూశారు. ఫోటోలు తీశారు. వీడియో తీశారు. మళ్ళీ యజమానితో సంభాషణ.

'దొంగతనం ఎప్పుడు జరిగింది'

'ఇప్పుడే! అరగంట ముందు!'

'దొంగనెవరు చూశారు?'

'నేనే!'

'మీ పేరు?' చెప్పాడు.

'దొంగ లోపలికి?'

'గోడదూకి!'

'దొంగతనం చేశాడా? చేయబోయాడా?'

'చేశాడు!'

'ఎలా తెలుసు?'

'దొంగసొత్తు చేతిలో ఉంది'

'డబ్బా? నగలా? బట్టలా? ఏం దొంగిలించాడు?'

'ఏమీ దొంగిలించలేదు!'

'తలుపులు, అలమరాలు, బీరువాలు పగలగొట్టాడా'?

'ఇంట్లోకే రాలేదు'

'మరి అతడి చేతిలో ఉన్న దొంగ సొత్తు ఏమిటీ?'

'గిన్నె-ప్లేటు!'

'బంగారమా?'

'కాదు!'

'వెండా!'

'కాదు!'

'స్టీలుదా?'

'కాదు. సత్తుది'

'దొంగ ఏంచేస్తున్నప్పుడు మీరు కొట్టారు?'

'ప్లేటు తీసుకొని చూస్తున్నప్పుడు!'

'ప్లేటులో ఏముంది?'

'కుక్కకు పెట్టిన బిరియాని!'

'తిన్నాడా?'

'తిన్లేదు!'